క్లుప్తంగా

రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా సాయిబాబునాయుడు



నియామకపత్రం అందుకుంటున్న సాయిబాబునాయుడు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): తూర్పుకాపు సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మక్క సాయిబాబునాయుడిని నియమిస్తూ జాతీయ అధ్యక్షుడు పిసిని చంద్రమోహన్ నియామకపత్రాన్ని శుక్రవారం అందించారు. నగరంలో తూర్పుకాపు సంక్షేమ సంఘం కార్యాలయంలో కోర్ కమిటీ సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సాయిబాబునాయుడు మాట్లాడుతూ రాష్ట్రంలో తూర్పుకాపు జాతి అభ్యున్నతి కోసం నిరంతరం పనిచేస్తానన్నారు. రిజర్వేషన్ల సమస్యలపై సంఘ పెద్దల సూచన మేరకు ఎటువంటి పోరాటాలకైనా సిద్ధంగా ఉంటానన్నారు. కార్యక్రమంలో తూర్పుకాపు సంక్షేమ సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ గుమ్మడి శాంతారావు, జిల్లా నాయకులు పాల్గొన్నారు.

సర్పంచ్‌కు సత్కారం



లక్ష్మణరావును సత్కరిస్తున్న గ్రామస్తులు

జి.సిగడాం: మండలంలోని సంతవురిటి గ్రామ సర్పంచ్ బుడారి లక్ష్మణరావును గ్రామస్తులు శుక్రవారం సన్మానించారు. సర్పంచ్ సొంత నిధులతో గ్రామ అభివృద్ధే ధ్యేయంగా అల్లూరి సీతారామరాజు విగ్రహ నిర్మాణంతోపాటు పార్క్ ఏర్పాటు చేశారు. దీంతో ఆయనను గ్రామస్తులు కొనియాడారు.

గ్రామాల అభివృద్ధే లక్ష్యం



రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఎన్ఈఆర్

జి.సిగడాం: గ్రామాల అభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు అన్నారు. మండలంలోని పాలఖండ్యాం గ్రామంలో రూ.2.30 లక్షలతో నిర్మించిన గోశాల ప్రారంభం, మెట్టవలస కూడలి నుంచి నిద్దాం మీదుగా రైల్వేస్టేషన్ వరకు రూ.3.30 కోట్లతో చేపడుతున్న రోడ్డు పనులకు శుక్రవారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో కూటమి మండల పార్టీ అధ్యక్షులు పైల విష్ణుమూర్తి, కుమరాపు రవికుమార్, మీసాల రవికుమార్, మాజీ ఎంపీపీ బాలబొమ్మ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనులు

ఎచ్చెర్ల: లావేరు మండలంలోని మురపాక గ్రామంలో పారిశుద్ధ్య పనులు శుక్రవారం చేపట్టారు. వీధుల్లోని చెత్త తొలగించి ట్రాక్టర్ల ద్వారా డంపింగ్ యార్డ్‌లకు తరలించారు. ఈ సందర్భంగా సర్పంచ్ పెయ్యల నాగమణి మాట్లాడుతూ ప్రజలంతా చెత్తను చెత్త కుండీల్లో వేయాలని సూచించారు. పరిసరాల పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమన్నారు. కార్యక్రమంలో సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

వాకర్స్ గవర్నర్ ప్రమాణ స్వీకారం

శ్రీకాకుళం అర్బన్: వాకర్స్ ఇంటర్నేషనల్ 102 గవర్నర్‌గా కొంక్యాన మురళీధర్ శుక్రవారం వాకర్స్ ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ ఎం.ప్రభావతి ఆధ్వర్యంలో ప్రమాణస్వీకారం చేశారు. వాకర్స్ పూర్వపు గవర్నర్ జామి నారాయణ స్వామి అధ్యక్షతన జెడ్పీ సమావేశ మందిరంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ప్రభావతి మాట్లాడుతూ నడకతో ఆరోగ్యం సిద్ధిస్తుందన్నారు. కార్యక్రమంలో వాకర్స్ పూర్వ గవర్నర్లు తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకులు అందజేత

గార: మండలంలోని శ్రీకూర్మం పంచాయతీలో ఉన్న నవజీవన్ ట్రస్టు ఆధ్వర్యంలో పేదలకు నెలవారీ సరుకులను శుక్రవారం అందజేశారు. ప్రతినెలా రెండో శుక్రవారం అన్నలక్ష్మీ పథకం పేరిట బియ్యం, పప్పు వంటి వంట సామాన్లుతో పాటు చలికాలం కావడంతో 35 మందికి రగ్గులను అందజేశామని మేనేజర్ ఎస్.వి.రమణ తెలిపారు. కార్యక్రమంలో ఉయ్యాల కృష్ణ, పప్పల నిర్మల, టి.సుజాత తదితరులు పాల్గొన్నారు.

ధనుర్మాస మేలుకొలుపు



ధనుర్మాస మేలు కొలుపు నిర్వహిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: శ్రీరామ యువజన సంఘం ఆధ్వర్యంలో పెద్దపాడు గ్రామంలో ధనుర్మాస మేలు కొలుపులు జరిగాయి. డిసెంబర్ 16 నుంచి గ్రామంలో ప్రతిరోజూ ఉదయం మేలుకొలుపులు నిర్వస్తున్నామని భజన బృందం సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో ఈదు శ్రీనివాసరావు, నక్క ఢిల్లీశ్వరరావు, కొందరామన్న, ఈదు సతీష్, దాను పోలారావు, శ్రీరామ భజన బృందం పాల్గొన్నారు.



లావేరులో దట్టంగా కురుస్తున్న మంచు

పగమంచు..!

జీడిమామిడిలో సస్య రక్షణ

- దట్టంగా కురుస్తున్న పొగమంచు
- మాడిపోతున్న జీడి, మామిడి పూత
- ఆందోళన చెందుతున్న రైతులు



జీడి తోటలు

ఎచ్చెర్ల: రైతు జీవిత కాలమంతా అదృష్ట, దురదృష్టాల మధ్య నిరంతరం పోరాటమే. ఏ సమయం కలిసొస్తుందో.. ఏ సమయం కాటేస్తోందో తెలియని పరిస్థితిలో ఊగిసలాడక తప్పదు. ఎన్నో ఆశలతో కంటికి రెప్పలా పంటను కాపాడుకుంటూ వస్తున్నా ప్రకృతి కన్నెర్ర చేస్తే నష్టం తప్పని పరిస్థితి. ఖరీఫ్ సీజన్‌లో రైతులు నష్టం నుంచి తప్పించుకోలేకపోయారు. దీంతో ఇప్పుడు ఆశలన్నీ జీడి, మామిడి పంటల ఫలసాయంపైనే. పలు ప్రాంతాల్లో మామిడిపూత విస్తారంగా వచ్చి రైతుల్లో ఆశలు పెంచింది.

అయితే గత 15 రోజులుగా కమ్ముకుంటున్న పొగ మంచుతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే జీడి, మామిడి తోటలకు అప్పులు చేసి మరీ ఎరువుల రూపంలో పెట్టుబడిపెట్టారు. మంచు ప్రభావంతో పూత ఇప్పుడు రాలిపోతుండడంతో పాటు ఆకులు నల్లగా మాడిపోతున్నాయి.

జీడిమామిడిలో సస్య రక్షణ

ప్రస్తుతం పొగమంచు ఎక్కువగా ఉంది. దీని కారణంగా జీడిలో టీ దోమ, మామిడిలో తేనె మంచు పురుగు ఉద్ధృతి పెరుగుతోంది. ఈ కారణంగా పూత మాడిపోయి తీవ్ర నష్టం వస్తుంది. టీ దోమ నివారణకు లీటర్ నీటిలో 1.6 మి.లీ ఇమిడా క్లోరిఫైడ్ మందును కలిపి పిచికారీ చేయాలి. తేనె మంచు పురుగు వల్ల పూత రాలిపోయే అవకాశం ఉంది. నివారణకు మోనోక్రోటోపాస్ 1.5 మిల్లీలీటర్లను లీటర్ నీటిలో కలిపి ఎకరానికి 200 లీటర్ల ద్రావణాన్ని పిచికారీ చేయాలి. పోటాష్ లోపంతో కూడా పూత రాలిపోయే అవకాశం ఉంది. అందువలన 5 గ్రాముల పొటాషియం నైట్రేట్‌ను లీటర్ నీటిలో కలిపి 200 లీటర్ల ద్రావణాన్ని ఎకరానికి 15 రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేసుకుంటే, పూత నిలవడంతో పాటు నాణ్యత పెరుగుతుంది. పిచికారీ తెల్లవారుజామున, సాయంత్రం సమయాల్లో మాత్రమే చేయాలి. ఎండలో స్ప్రే చేయకూడదు. పూత, కాండం, చెట్టు మొదలు తడిచేలా స్ప్రే చేయాలి. పూత విచ్చుకున్న దశలో స్ప్రే చేయకూడదు. ఆకు, పిందె దశలో మాత్రమే మందు స్ప్రే చేయాలి. జీడి మామిడి పండించే రైతులు సస్య రక్షణ చర్యలు సకాలంలో చేపడితే అధిక లాభాలు పొందవచ్చు.

ముంచేస్తున్న నకిలీ మందులు

నకిలీ మందులు రైతులను ముంచేస్తున్నాయి. విచ్చలవిడిగా మార్కెట్‌లో చలామణి అవుతున్న నకిలీ మందులను అరికట్టడంలో అధికారులు విఫలమవుతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. నకిలీ బెడదతో చేతిచమురు వదులుతోంది తప్ప పంటను మాత్రం కాపాడుకోలేకపోతున్నారు. సరైన సమయంలో ఏ మందులు వాడాలో ఉద్యానవన శాఖాధికారుల సలహా తీసుకుంటే నష్టం నుంచి తప్పించుకునే అవకాశం ఉంటుంది.

ఆందోళన కలుగుతోంది

కొద్ది రోజులుగా పొగమంచు దట్టంగా కురుస్తోంది. పొగమంచు కారణంగా ఏటా నష్టం తప్పడం లేదు. పూత బాగున్నా పొగ మంచుతో తెగుళ్ల వ్యాపించి మాడిపోతుంది. పూత నిలబడేందుకు పురుగుల మందులు స్ప్రే చేస్తున్నాం.

– బి.దాలినాయుడు, జీడి రైతు, గొల్లపేట, ఎచ్చెర్ల మండలం

సలహాలు పాటించాలి

రైతులు ఉద్యానవన శాఖ అధికారుల సూచనలు, సలహాలు పాటించాలి. సాగులో యాజమాన్య పద్ధతులను, శాస్త్రీయ పద్ధతులను అవలంభించాలి. పొగమంచు, పురుగు నివారణకు సంబంధించి ఏ సమయంలో ఎటువంటి మందులు పిచికారీ చేయాలనే విషయాలపై అవగాహన అవసరం.

– సుదర్శన, ఉద్యానవన శాఖ అధికారి, ఎచ్చెర్ల

ఎచ్చెర్ల నియోజకవర్గంలో సుమారుగా 16 వేల ఎకరాల్లో జీడి, 85,00 ఎకరాల్లో మామిడి తోటల పెంపకం చేపడుతున్నారు.

ఉత్తర ద్వారం.. మోక్షమార్గం

వైకుంఠ ఏకాదశి పురస్కరించుకొని ఊరూరా ఆధ్యాత్మిక శోభ నెలకొంది. శుక్రవారం తెల్లవారుజాము నుంచే వేంకటేశ్వరస్వామితోపాటు వివిధ ఆలయాలకు భక్తులు పోటెత్తారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు ఉత్తర ద్వార దర్శన భాగ్యం కల్పించారు. గోవిందనామ స్మరణతో ఆలయ పరిసరాలు మారుమోగాయి. పలు ఆలయాల్లో వైభవంగా దీపోత్సవం జరిగింది. అర్చకులు ప్రత్యేక పూజలు చేసి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కమిటీ సభ్యులు ఆలయాల వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

– సాక్షి నెట్‌వర్క్



అరసవల్లిలో దర్శనానికి బారులుతీరిన భక్తులు



అరసవల్లిలో ప్రత్యేక అలంకరణలో ఆదిత్యుని ఉత్సవమూర్తులు



అరసవల్లిలో ఉత్సవమూర్తులకు హారతినిస్తున్న ప్రధానార్చకులు శంకరశర్మ



శ్రీకాకుళం కల్చరల్: కోదండ రామాలయంలో ఉత్తర ద్వార దర్శనాలు



అరసవల్లిలో ఉత్తర ద్వారం వద్ద భక్తుల సందడి



ఎచ్చెర్ల క్యాంపస్: వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న దృశ్యం



గార: శ్రీకూర్మంలో గరుడ వాహనంపై తిరువీధిలో స్వామి



శ్రీకాకుళం కల్చరల్: హడ్కో కాలనీలో వైకుంఠ ఏకాదశి ఉత్తర ద్వార దర్శనాలు



ఎచ్చెర్ల క్యాంపస్: ఫరీదుపేటలో ప్రత్యేక అలంకరణలో రంగనాథస్వామి



అరసవల్లి: ఏకాదశి కల్యాణ సేవ నిర్వహిస్తున్న అర్చకులు



గార: శ్రీకూర్మంలో సేవా కాలంలో నక్షత్ర హారతినిస్తున్న ప్రధానార్చకులు



శ్రీకాకుళం కల్చరల్: నారాయణ తిరుమలలో ఉత్తర ద్వారం వద్ద ఉత్సవమూర్తుల పూజలు



జి.సిగడాం: స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు



శ్రీకాకుళం కల్చరల్: కోలాట ప్రదర్శన చేస్తున్న మహిళలు



గార: భక్తులకు దర్శనమిస్తున్న శాలిహుండం వేణుగోపాలస్వామి



ఎచ్చెర్ల: అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న దృశ్యం



శ్రీకాకుళం కల్చరల్: శివబాలాజీ ఆలయంలో పుష్పాభిషేకం

సరదాల సంక్రాంతి

భోగి మంటలు.. గొబ్బెమ్మలు.. గాలి పటాలు.. ముగ్గుల పోటీలతో జిల్లాలోని పలుచోట్ల సంక్రాంతి ఉత్సవాలు మిన్నంటాయి. ప్రతి ఒక్కరూ సాంప్రదాయ దుస్తుల్లో ముందస్తు వేడుకలతో సంక్రాంతికి శుక్రవారం స్వాగతం పలికారు. డూ.. డూ బసవన్నలు, హరిదాసులు సందడి చేయగా రెట్టించిన ఉత్సాహం నెలకొంది.

– సాక్షి నెట్‌వర్క్



శ్రీకాకుళం కల్చరల్: భోగి మంటలు వేస్తున్న యోగా గురువులు



ఎచ్చెర్ల క్యాంపస్: శివానీ కాలేజీలో ముగ్గుల పోటీల్లో విద్యార్థినులు



ఎచ్చెర్ల క్యాంపస్: గాలిపటం ఎగురవేస్తున్న శివానీ కాలేజీ ట్రెజరర్ దుప్పల వెంకటరావు



శ్రీకాకుళం రూరల్: బొల్లినేని మెడిస్కిల్స్‌లో ముగ్గులు వేస్తున్న విద్యార్థులు

ఫీల్డ్ అసిస్టెంట్లకు శిక్షణ తరగతులు



మాట్లాడుతున్న పీడీ సుధాకర్‌రావు

రణస్థలం: ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్లకు వృత్తి నైపుణ్యంపై సమగ్ర అవగాహన అవసరమని జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ బి.సుధాకరరావు అన్నారు. మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో లావేరు, రణస్థలం క్షేత్ర సహాయకులకు శిక్షణా తరగతులను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వేతనదారుడుకి రోజువారి కూలి రూ.300 రావాలంటే మేట్‌లే కీలకమన్నారు. ప్రతీ నలభై మందికి ఒక మేట్ అవసరమని ఆ దిశగా చదవడం, రాయడం, పనిపై ఆసక్తి, నైపుణ్యం ఉన్న వాళ్లనే కొత్తగా తీసుకోవాలని సూచించారు. జాబ్ కార్డు ఉన్న వారందరికీ వంద రోజుల పని దినాలు కల్పించాలనే లక్ష్యాన్ని నిర్దేశించారు. అలాగే వారం దరూ పనులకు వచ్చేలా గ్రామస్థాయిలో అవగాహన సభలు పెట్టాలన్నారు. పనులు గుర్తించేటప్పుడు సరైన జాగ్రత్తలు తీసుకుంటే గ్రామాభివృద్ధికి దోహదపడతాయని చెప్పారు. అనంతరం జే.ఆర్.పురంలో చేపడుతున్న రహదారి పనులతో పాటు గోశాలను పరిశీలించారు. కార్యక్రమంలో ఏపీడీ లోకేష్, ఏపీవోలు ఎం.శ్రీనివాసనాయుడు, ఆర్ సత్యవతి, జేఈలు లెనిన్‌బాబు, గౌరీశంకర్, రిసోర్స్ పర్సన్ ఇప్పిలి గౌరినాయుడు, విక్రమ్, పురుషోత్తం, సందీప్ తదితరుల ఉన్నారు.

సంక్షిప్తంగా..

రంగవల్లుల పోటీలు



ముగ్గులను పరిశీలిస్తున్న కమిటీ సభ్యులు

గార: మండలంలోని రామచంద్రాపురం పంచాయతీలో సంక్రాంతి ఉత్సవాల్లో భాగంగా గ్రామ పెద్దలు, సచివాలయ సిబ్బంది రంగవల్లుల పోటీలు శుక్రవారం నిర్వహించారు. శిమ్మపేటలోని రైతు భరోసా రోడ్డులో నిర్వహించిన పంచాయతీ స్థాయి పోటీల్లో అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు. న్యాయ నిర్ణేతలుగా సర్పంచ్ జీవీ రమణమూర్తి, అంబటి చక్రధరరావు, ఎంపీటీసీ రుప్ప శ్రీనివాసరావు, సాధు మల్లిఖార్జునరావు, కుంచాల సురేష్, సెక్రటరీ ఎం.రాములు వ్యవహరించారు. గెలుపొందిన మహిళలకు బహుమతులు శనివారం అందజేస్తామని తెలిపారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఆంధ్రప్రదేశ్ సీపీఎస్ ఎంప్లాయీస్ అసోసియేషన్ 2025 సంవత్సరం క్యాలెండర్‌ను కలెక్టరేట్ వద్ద జిల్లా ఖజానా శాఖాధికారి సీహెచ్ రవికుమార్, ఏటీవో తవిటన్నలు ఆధ్వర్యంలో శుక్రవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏపీసీపీఎస్ఈఏ జిల్లా అధ్యక్షుడు వి.శరత్, జిల్లా ప్రధాన కార్యదర్శి అంపోలు షణ్ముఖరావు, జిల్లా యూనిట్ మహిళ అధ్యక్షురాలు జయమ్మ, రాష్ట్ర కౌన్సిలర్ శ్యాం కుమార్, జిల్లా ఉపాధ్యక్షుడు డేవిడ్ రాజు, జిల్లా కార్యదర్శులు యాళ్ల శ్యాంసుందర్, దన్నాన మోహన్ కిరణ్, శ్రీధర్ సూర్య తదితరులు పాల్గొన్నారు.

యువతే దేశానికి వెన్నుముక

శ్రీకాకుళం న్యూకాలనీ: యువతరమే దేశానికి వెన్నుముక అని జిల్లా ఉపాధి అధికారి కొత్తలంక సుధ పేర్కొన్నారు. నగరంలోని ఎల్ఐసీ కార్యాలయం పక్కనున్న కాకినాడ ఆదిత్య మహిళా డిగ్రీ కళాశాలలో స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకుని నేషనల్ యూత్ డే వేడుకలను శుక్రవారం నిర్వహించారు. ఎన్‌వైకే యూత్ ఆఫీసర్ కె.వెంకట్ ఉజ్వల్‌తో కలిసి ముఖ్య అతిథిగా హాజరైన సుధ మాట్లాడుతూ.. యువత విలువైన కాలాన్ని వృథా చేయకుండా తమ ఉజ్వల భవిష్యత్‌పై దృష్టిసారించాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కె.శివశంకర్, కళాశాల డైరెక్టర్ బీవీ చక్రవర్తి, వైస్ ప్రిన్సిపాల్ కె.వేణు, ఎన్ఎస్ఎస్ పీవో ఎల్.మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ అంతరాయం లేకుండా చర్యలు

శ్రీకాకుళం క్రైమ్: రానున్న రథసప్తమి పురస్కరించుకుని జిల్లా కేంద్రంలో ఎటువంటి ట్రాఫిక్ అంతరాయం లేకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని, సూర్యనారాయణున్ని దర్శించుకునే భక్తులకు అసౌకర్యం కలగకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు చేసుకోవాలని అధికారులకు ఎస్పీ కె.వి.మహేశ్వర రెడ్డి సూచించారు. శుక్రవారం రెవెన్యూ, పోలీస్, మున్సిపల్, ఆలయ అధికారులతో ఆలయం నలువైపులా సందర్శించారు. భక్తులు దర్శనం కోసం వెళ్లే మార్గాలు, క్యూలైన్ల మళ్లింపు, పార్కింగ్, బందోబస్తు, భద్రతపరంగా అనువైన ప్రదేశాలు పరిశీలించారు.

ప్రతి ఒక్కరూ హెల్మెట్ వాడాలి

శ్రీకాకుళం పాతబస్టాండ్: ద్విచక్ర వాహనాలు నడిపే ప్రతి ఒక్కరూ హెల్మెట్ తప్పనిసరిగా వినియోగించాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా అన్నారు. శుక్రవారం సాయంత్రం జిల్లా న్యాయస్థానం ఆవరణలో జిల్లా న్యాయమూర్తుల సమక్షంలో అపిటోరియా ఫార్మా ప్రైవేట్ లిమిటెడ్ పైడి భీమవరం వారి సౌజన్యంతో కోర్టులో పలువురు ఉద్యోగులకు హెల్మెట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో న్యాయమూర్తులు పి.భాస్కరరావు, సీహెచ్ వివేకానంద్, శ్రీనివాస్, ఎస్ఎం ఫణికుమార్, కె.కిషోర్, ఆర్.సన్యాసినాయుడు, జిల్లా బార్ అసోసియేషన్ ప్రతినిధులు, న్యాయవాదులు, అపిటోరియా ఫార్మా ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.